# రంగడు

మిట్టమధ్యాహ్నపు ఎండ లెక్కచేయకుండా, హుషారుగా వీధిలోకి పరుగెత్తాడు రంగడు.

వీధి చివరి రావిచెట్టు కింద నుంచుని ఎదురుగా ఉన్న మేడవైపు చూస్తూ గట్టిగా ఈల వేశాడు. ఆ ఈల విని మరో నిమిషంలో జమీందారుగారి శివుడు, అమ్మాయి లీల రావిచెట్టు కిందకు వచ్చారు, చప్పుడు కాకుండా అడుగులు వేసుకుంటూ పిల్లుల్లా.

'మీ నాన్నగారు యింట్లో వున్నారా? అన్నాడు శివుడు.

'నాన్నగారు నిద్రపోతున్నారు. అమ్మ యింట్లో ఏదో పని చేసుకుంటోంది' అన్నాడు శివుడు.

మంచి తెలివితేటలతో దొంగతనంగా యింట్లోంచి దాటి వచ్చా మన్నట్లు గర్వంగా నవ్వింది లీల.

'చిన్న నాయుడు యింకా రాలేదే?' రంగడు శివుడివైపు చూశాడు.

'వచ్చాను' అంటూ పకపక నవ్వుతూ చిన్ననాయుడు రావిచెట్టు మీదనుంచి ఆ కుర్రాళ్ళ మధ్యకు దూకాడు. చిన్ననాయుడు అందరికన్నా ముందు వచ్చి స్నేహితులకు తన రాకవల్ల ఆశ్చర్యం కలిగించాలని చెట్టు ఎక్కి దాక్కున్నాడు.

'వెడదామా?' అన్నాడు రంగడు

'ఊ' అన్నాడు శివుడు.

చుట్టు ప్రక్కల రోడ్డుమీద ఎవరూ నడవటంలేదుకదా అని ఒక్కసారి పరీక్షించాడు చిన్ననాయుడు.

తల్లి తండ్రులు యింట్లో ఎండవేడికి కునుకు తీసుకుంటున్నప్పుడు ఎవరికీ తెలియకుండానే ఒకపని చెయ్యాలనుకున్నారు ఆ కుర్రాళ్ళందరూ.

మెల్లిగా బాలాజీ చెరువుగట్టువైపు నడిచారు ఆ నల్గురూ చెరువులో నీళ్ళు ఎండలో తళతళ మెరుస్తున్నాయి. చెరువులో పెరిగిన నాచు, చెత్తా, చెదారం మొదలైనవాటిని శుభ్రం చేయడానికి ఒక పడవ చెరువు ఒడ్డున కట్టివుంది. గట్టుమీద తీసివేసిన నాచు, వేసవికాలంలో ఆ చెరువులోంచి తీయించివేయడం ఆ గ్రామంలో అలవాటు.

ఆ పడవ చూశాక, ఒకరోజు రంగడికి ఒక ఆలోచన తట్టింది. ఆ పడవ ఎక్కి, నడుపుకుంటూ చెరువులో షికార్లు చెయ్యాలని బుద్ధి పుట్టింది రంగడికి, దీనికి జమీందారుగారి అబ్బాయి కూడా ఒప్పుకున్నాడు. పడవ ఎక్కాలని లీల గంతులేసింది. చిన్ననాయుడు 'రెడీ' అంటూ చొక్కా చెవులు రిక్కించాడు. మిట్టమధ్యాహ్నం అందరూ భోంచేసి సాధారణంగా విశ్రమించే సమయంలో ఆ పని చెయ్యాలని నిశ్చయించుకున్నారు ఆ కుర్రాళ్ళందరు.

చెరువులో ఉన్న పడవను చెరువు గట్టుమీది ఒక ఈతచెట్టుకు ఒక తాడుతో కట్టారు. ఆ తాడు విప్పేశాడు చిన్ననాయుడు.

రంగడు పడవలోకి దూకాడు. జమీందారుగారి అబ్బాయి లీలను మెల్లిగా పడవ ఎక్కించాడు. చిన్ననాయుడు పంట్లాము పైకి మడిచి, పడవ తోసి లోపలికి ఎగిరాడు.

పడవ చెరువు నీళ్ళల్లోకి నడిచింది. రంగడు తెడ్లు వేశాడు. చెరువు నీళ్ళు పడవ నడకలో చీలి, ఎగిరి కెరటాల్లా కదులుతూ గలగలా శబ్దం చేస్తున్నాయి. ఒకవైపు బీటలు వేసిన చేలగట్లు, మరోవైపు అమ్మవారి గుడి స్పష్టంగా చెరువులోంచి కనిపించాయి ఆ కుర్రాళ్ళకు. పడవ మెల్లిగా చెరువుమధ్యకు వచ్చింది నాచును దూసుకుంటూ, చేతి కందిన కాలువ పువ్వులు, కాడలు కోస్తున్నాడు నాయుడు. కలువకాడలు విరిచి నీళ్ళల్లో ఊది, గాలిబుడగలు తెప్పిస్తోంది లీల. జమీందారుగారి అబ్బాయి సినీ పాటలు కూనిరాగాలుగా తీశాడు. రంగడు ఒక గొప్ప నాయకుడిలా పోజపెట్టి ఠీవిగా నవ్వాడు.

రెండు గంటలుగడిచాయి. ఆ అరమైలు చదరంగం చెరువులో అప్పుడే చాలా ప్రదక్షిణాలు చేశారు ఆ పడవ త్రిప్పుతూ ఆ కుర్రాళ్ళంతా.

మిట్టమధ్యాహ్నపు ఎండ తగ్గడంవల్ల చెరువు ప్రక్కన ఉన్న రోడ్డుమీద కొంతమంది జనం నడుస్తున్నారు. ఎవరూ ఆ చెరువులోని పడవను చూడలేదు ప్రత్యేకించి. చూసినా, కూలివాళ్ళు చెరువులో నాచు తీస్తున్నారనుకున్నారు.

చెరువు మధ్యకు వెళ్ళిన పడవ హఠాత్తుగా ఆగిపోయింది. తెడ్డుతో ఎంత నెట్టినా కదలడం మానేసింది. దట్టంగా అల్లుకున్న నాచులోకి ఆ పడవ జారి, బయటికి రావడం కష్టమైపోయింది.

కూలివాళ్ళు నాల్గు గంటలకు చెరువుదగ్గరకు వచ్చారు. పడవను చెరువు మధ్య చూసి ఆశ్చర్యపోయారు. దూరంనుంచి పడవలో కుర్రాళ్ళు ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

నాచుమధ్య నుంచి ఈదుకుని చెరువుమధ్యకు వెళ్ళడం ఎవరికైనా కష్టమే పైగా ప్రతీ ఏడు యీ నాచు తీసే రోజుల్లో ఎవరో ఒకరు చెరువులో చనిపోడం మామూలు. ఆ భయంవల్ల కూలివాళ్ళు చెరువులో ఈది పడవను ఒడ్డుకు చేర్చడానికి జంకారు.

చెరువు మధ్య చిక్కుపడిన పడవను చూస్తూ గట్టుమీద మూగిన జనం వింతగా చూస్తున్నారు.

పడవలోని రంగడికి అమిత భయం వేసింది. లీల ఏడ్వడం మొదలుపెట్టింది. జమీందారుగారి అబ్బాయి, చిన్ననాయుడు తలలు గోక్కుంటూ, భయంతో ఒకరివైపు ఒకరు చూసుకుంటూ ఏం చేయడానికి తోచక బిక్కముఖాలతో కూర్చున్నారు పడవలో.

చెరువుగట్టుమీది జనాన్ని దూసుకొని గవరయ్య చెరువులోకి దూకాడు. నాచును విడదీసుకుంటూ, అతికష్టంమీద చెరువుమధ్య పడవను చేరాడు. ఒక చేత్తో ఈదుతూ, పడవను గట్టు జేర్చాడు.

పడవ గట్టు చేరగానే, చిన్ననాయుడు, గబుక్కున దుమికి పారిపోయాడు. జమీందారుగారి పిల్లలనే గౌరవంతో శివుడిని, లీలని గవరయ్య ఏమీ అనలేకపోయాడు. రంగడు పడవ దిగి పారిపోదామనుకుంటూంటే గవరయ్య పట్టుకున్నాడు.

'ఏరా బుద్ధిలేదూ! చెరువు మధ్యకు పోయారు-చస్తేనో!' పిల్లల గండం తప్పించగలిగాననే ధైర్యపు చనువుతో రంగడిని చెంపమీద చరిచాడు గవరయ్య.

ఆ చెంపమీది దెబ్బ రంగడికి తల తిరిగినంత పని చేసింది. కంసాలి గవరయ్య కరణంగారి అబ్బాయిని కొట్టడమా? పైగా నల్గురిలో? అందులో తన్నొక్కడినే గవరయ్య కొట్టాడని రంగడికి బాగా ఉక్రోషం వచ్చింది.

'నువ్వెవరవు నన్ను కొట్టడానికి?" కోపంతో అరుస్తూ చెరువు గట్టు మీద ఒక కంకర్రాయి తీసుకుని గవరయ్యమీదకు రివ్వున విసిరాడు.

గవరయ్యకు గాయం తగిలి రక్తంకారింది.

దానితో కోపం మరీ హెచ్చి గవరయ్య రంగడిని మరో రెండు దరుపులు చరిచాడు. ఆ దెబ్బల భారంవల్ల రంగడికి రెండు రోజులు జ్వరం వచ్చింది. తాను పెద్ద వాడయ్యాక ఎప్పటికైనా గవరయ్యమీద కసి తీర్చుకోవాలని క్రుద్ధుడై పోయాడు రంగడు. కొడుకుకు

జ్వరం వచ్చిందని గవరయ్యమీదకు జట్టీకి దిగారు. కరణంగారు కూడా.

గవరయ్య గజీఈతగాడని పేరు. సాయంత్రం స్నానానికి చెరువుకు వచ్చి, నీళ్ళలో రకరకాల పిల్లిమొగ్గలు వేస్తూ, ఆడుకుందుకు చెరువు గట్టుకు వచ్చే పిల్లలను ఆనందింపజేసేవాడు గవరయ్య. ఒక్కొక్కసారి నీళ్ళల్లో మునిగి ఒక అరమైలు అవతల తేలడం, అర్ధగంట ఐనా పైకి రాకపోవడం పిల్లలకి సరదాగా ఉండేది చూడడానికి. బుల్లెప్ప గారి పదేండ్ల కూతురు, వెంకయ్యగారి పాతికేండ్ల కొడుకు చెరువులో జారి మునిగి గుటకలు వేస్తూంటే, రక్షించడంవల్ల గవరయ్య అంటే అందరికీ గౌరవమే.

ఒకరోజు సాయంత్రం రంగడు ఒంటరిగా చెరువు గట్టుమీద కూర్చుని, చెరువులో కాగితం పడవలు వదులుతున్నాడు. ఒక పడవ తామరకాడ దగ్గర ఆగిపోయింది. మరొకటి గాలిలో కదులుతూ వయ్యారంగా నడుస్తోంది. మరొకటి చెరువు ప్రక్కన రాతికి అడ్డుకుంది.

వెనకాలనుంచి గవరయ్య రంగడి పడవలు చూశాడు. ఒక పడవ మీద సరదాగా ఒక రాయి విసిరాడు. కాగితం పడవ నీళ్ళలో తడిసి మునిగిపోయింది.

గవరయ్యను చూడగానే రంగడికి కోపం వచ్చింది.

'ఏయ్! నా జోలికి రాకు అనవసరంగా' అరిచాడు రంగడు.

గవరయ్య నవ్వాడు. ఆ నవ్వుచూసి రంగడికి మరీ కోపం వచ్చింది.

'ఫో' అరిచాడు రంగడు.

గవరయ్య దగ్గరికి వచ్చాడు. అప్పుడే బజారునుంచి తెచ్చిన సంచిలోని మామిడిపండు తీసి రంగండి చేతిలో పెట్టాడు.

'అక్కర్లేదు ఫో' అన్నాడు రంగడు.

'నా బాబుకదూ! తిను!' అన్నాడు గవరయ్య రంగడి గెడ్డం పట్టుకుని.

మామిడిపండు తినాలని బుద్ధిపుట్టి, గవరయ్య మంచితనం అర్థం చేసుకున్నాడు రంగడు. వాడు మామిడిపండు తింటున్నాడు. గవరయ్య హాయిగా నవ్వాడు.

చెరువులోని ఒక కాగితం పడవ గాలికి రివిగా పురుగెత్తి చెరువు మధ్య నాచులోకి పోయింది.

'అరే! పడవ చాలాదూరం పోయిందే!' నొచ్చుకున్నాడు రంగడు.

'తెచ్చియివ్వనా!' అన్నాడు గవరయ్య.

‘పిల్లిమొగ్గలు వేస్తూ తేవాలి!’ అన్నాడు రంగడు.

‘ఓ’ అంటూ గవరయ్య చెరువులోకి దూకాడు.

ఒక మునుగు మునిగాడు గవరయ్య

కాగితం పడవ దూరాన కనిపిస్తూనే వుంది గాని, గంట గడిచినా గవరయ్య తేలలేదు చెరువులో ఎక్కడా.

గవరయ్య ఏదో తమాషా చేశాడనుకుంటూ రంగడు యింటికి వెళ్ళిపోయాడు.

మర్నాడు ప్రొద్దున్న గవరయ్య శవం చెరువులో తేలింది. ఆ చెరువులో, పాములున్నాయని, ఊబి ఉందని జనం మామూలుగా అనుకున్నారు. కాని రంగడు మాత్రం గవరయ్య చనిపోయాడని చాటుగా ఏడ్చాడు.